సాక్షి ఖమ్మం

గురువారం । 18 । మే । 2023



కొలువుల పేరుతో దగా

జెన్‌కోలో ఉద్యోగాలు కల్పిస్తామంటూ కార్మిక సంఘాల నాయకులు నిరుద్యోగ యువతను మోసం చేస్తున్నారు. 8లో



బ్లాక్ స్పాట్ల గుర్తింపు..

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్న సీపీ ఆదేశాలతో పోలీసులు, ఇంజనీర్లు ఖమ్మం- వైరా రహదారిపై పలు బ్లాక్ స్పాట్లను గుర్తించారు. 8లో

గరిష్టం / కనిష్టం
42° / 28°

వాతావరణం

జిల్లాలో గురువారం ఉష్ణోగ్రత అధికంగా ఉంటుంది. రాత్రి వేళ కూడా వాతావరణం వేడిగా ఉంటుంది.

భానుడి భగభగ

ఉక్కపోత, వడగాలులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి

- ఉదయం నుంచే సూర్య ప్రతాపం
- బయటకు వచ్చేందుకు జంకుతున్న ప్రజలు
- ఖానాపురంలో 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు


ఎండ తీవ్రతతో నిర్మానుష్యంగా ఉన్న ఖమ్మంలోని మయూరిసెంటర్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ప్రచండ భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. ఏప్రిల్‌లో ఎండలు బాగానే ఉన్నా.. అల్పపీడనం ప్రభావంతో వర్షాలు పడి కొంత చల్లబడింది. అయితే గత పది రోజులుగా సూర్యుడు ఉగ్రరూపం దాల్చాడు. రోహిణి కార్తె రాకముందే ఎండలు దంచి కొడుతున్నాయి. ఉదయం 9 గంటలకే ఎండ మొదలవుతుండగా.. మధ్యాహ్నం పరిస్థితి చెప్పక్కర్లేదు. వేసవి తీవ్రతతో ప్రజలు బయట తిరగాలంటేనే భయపడుతున్నారు. దీంతో మధ్యాహ్నం రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. రాత్రి 8 గంటల వరకూ వేడిగాలుల ప్రభావం తగ్గడం లేదు.

కొద్ది రోజుల్లోనే..

ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లాలో ఏప్రిల్‌లో వర్షాలు కురవడంతో వాతావరణం చల్లగా మారింది. అయితే మే నెల రాగానే ఎండలు ఒక్కసారిగా పెరిగాయి. గత కొన్ని రోజులుగా అయితే సూరీడు నిప్పులు కురిపిస్తున్నాడు. ప్రజలు బయటకు రావద్దని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసే పరిస్థితి ఏర్పడింది. ప్రతి రోజూ 40డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రస్తుతం శుభకార్యాల సీజన్ కావడంతో ఎండ వేడిని తట్టుకునేందుకు కార్యాల నిర్వాహకులు, బంధుమిత్రులు నానా తంటాలు పడుతున్నారు. చాలా మంది ధర ఎక్కువైనా సరే ఏసీ ఫంక్షన్ హాళ్లలోనే పెళ్లిళ్లు చేస్తున్నారు.

40 డిగ్రీలకు పైగానే..

జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైగానే నమోదవుతున్నాయి. అత్యధికంగా 45 డిగ్రీల వరకు వస్తుండడం గమనార్హం. బుధవారం ఖానాపురం పరిధిలో 45.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. జిల్లాలోని ఎనిమిది ప్రాంతాల్లో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు, రెండు ప్రాంతాల్లో 43 డిగ్రీలు, 12 ప్రాంతాల్లో 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 15 ప్రాంతాల్లో 41, రెండు ప్రాంతాల్లో 40 డిగ్రీలు నమోదయ్యాయి.

తీవ్రమైన ఉక్కపోత..

ఉక్కపోత, వడగాలులు వీస్తుండటంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. ఇళ్లలో కూలర్లు, ఫ్యాన్‌లు కూడా చల్లదనాన్ని ఇవ్వడం లేదు. వృద్ధులు, చిన్నారులు ఎండకు అల్లాడుతున్నారు. ఏసీలు వినియోగం ప్రస్తుతం ఎక్కువైంది. చల్లని పానీయాలు తాగేందుకు ఆసక్తి చూపుతున్నారు. శరీరం డీహైడ్రేషన్‌కు గురి కావడంతో నీరసపడిపోతున్నారు. వీటిపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అలాగే వాహనాలు, మొక్కలు ఇలా అనేకం ఎండవేడికి దెబ్బతినకుండా జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు.

జాగ్రత్తలు పాటించకపోతే ప్రమాదం



ఎండల ప్రభావం నాలుగైదు రోజులుగా పెరిగింది. ఇది వృద్ధులు, బీపీ, షుగర్, గుండె జబ్బు బాధితులపై ఎక్కువ ప్రభావం చూపిస్తుంది. వేడి ఎక్కువైతే హైపోతలమస్ ఫెయిల్యూర్ అవుతుంది. దీంతో ఎండ ఎన్ని డిగ్రీలు ఉంటే శరీర ఉష్ణోగ్రతలు కూడా అదే రీతిలోకి చేరతాయి. తద్వారా సోడియం, పొటాషియం, లవణాలతో పాటు నీటి శాతం తగ్గిపోతాయి. బీపీ పడిపోయి కార్డియాక్ అరెస్ట్, కిడ్నీ ఫెయిల్యూర్స్ సంభవించి మరణానికి దారి తీస్తుంది. – డాక్టర్ వేము గంగరాజు, ఎండీ

భానుడి ప్రభావానికి లోను కావద్దు



గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పగటిపూట భానుడి ప్రభావానికి గురికాకుండా ఉంటే మేలు. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే బయటకు రావాలి. నీరు ఎక్కువగా తాగాలి. పౌష్టికాహారం తీసుకోవాలి. ఎక్కువ విశ్రాంతి అవసరం. రోజుకు కనీసం 8 గంటలు నిద్రపోవాలి. నాలుక పొడిబారటం, కళ్లుగుంతలు పడటం, నీరసానికి గురికావటం వంటి లక్షణాలు ఉంటే దగ్గరలోని ఆస్పత్రికి వెళ్లి వైద్యుడిని సంప్రదించాలి.
– కృపాఉషశ్రీ , గైనిక్, హెచ్‌ఓడీ పెద్దాస్పత్రి

పరిశుభ్రతకు ప్రాధాన్యం



వేసవిలో కుక్కల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తాం. ప్రతి రోజూ బ్రెష్, స్నానం చేయిస్తాం. నెయిల్ ట్రిమింగ్, గ్రూమింగ్ చేస్తాం. విశ్రాంతి కోసం పెట్ మసాజ్ చేస్తాం. బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. వ్యాయామం చేయిస్తాం. ఉష్ణోగ్రతల నుంచి రక్షణకు ఆహారంగా పుచ్చకాయలు, అరటి పండ్లు, నారింజ, దోసకాయలు ఇస్తాం. పశు వైద్యాధికారుల సలహాలు పాటిస్తాం.
– మనోజ్ఞ, ఖమ్మం

డీహైడ్రేషన్ కాకుండా చూడాలి



అధిక ఉష్ణోగ్రతలు ఉన్న సమయంలో పశువులు, పెంపుడు జంతువులు డీహైడ్రేషన్‌కు గురికాకుండా చూసుకోవాలి. శరీరంలో నీరు క్షీణించకుండా అవసరమైన చర్యలు పాటించాలి. చెమట రూపంలో నీరు, ఖనిజాలు, లవణాలు బయటకు వెళ్తాయి. దీంతో పశువులు నీరసిస్తాయి. ఆ నీరసం అధికమైతే మరణిస్తాయి. వాటిని ఎండలో బయటకు తీసుకెళ్లొద్దు. అవసరమైతే గ్లూకోన్ -డీ వంటి పౌష్టికాహారాన్ని ఇవ్వాలి.
– డాక్టర్ అనంత్ హరీష్, పశువైద్యాధికారి

వాహనాన్నీ మనిషిలా చూసుకోవాలి



వేసవిలో ఎండ నుంచి మనం ఎలా జాగ్రత్తలు పాటిస్తామో వాహనాలకు కూడా అంతే రక్షణ కల్పించాలి. ఎండాకాలంలో ఇంజన్ త్వరగా వేడై ఆయిల్ ఎక్కువగా తాగుతుంది. ఇంజన్ చెడిపోకుండా ఉండాలంటే ఆయిల్ స్థాయి తగ్గకుండా చూసుకోవాలి. ఎండ ఎక్కువ ఉన్నప్పుడు వాహనాన్ని నిదానంగా నడపాలి. నీడకు పార్కింగ్ చేయాలి.
– తుపాకుల రవి, మెకానిక్

పరిశోధనలపై దృష్టి పెట్టండి

- వై 20 సదస్సులో గవర్నర్ పిలుపు
- విద్యార్థుల ప్రాజెక్టులు పరిశీలించిన తమిళిసై
- ఎస్‌సీఐటీ ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభం


జ్యోతిప్రజ్వలన చేస్తున్న గవర్నర్


విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలిస్తున్న తమిళిసై

ఖమ్మంరూరల్: చదువుకునే సమయంలో విద్యార్థులు ఆవిష్కరణలు, పరిశోధనలపై దృష్టి పెట్టాలని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సూచించారు. శ్రీ చైతన్య ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని పొన్నెకల్‌లో నిర్వహిస్తున్న ఖమ్మం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (కిట్స్)లో బుధవారం నిర్వహించిన వై 20 సదస్సుకు గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమెకు శ్రీచైతన్య విద్యాసంస్థల యాజమాన్యం ఘనంగా స్వాగతం పలికింది. అనంతరం విద్యార్థులు తయారు చేసిన ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్, కంప్యూటర్ సైన్స్, మెకానికల్ ప్రాజెక్టులను సందర్శించిన గవర్నర్ వారిని అభినందించారు. వ్యవసాయం, ఆరోగ్యం, మహిళా రక్షణ, సైబర్ సెక్యూరిటీ అంశాల్లో రూపొందించిన ప్రాజెక్టుల్లో వారి నైపుణ్యం కనిపిస్తోందన్నారు. అనంతరం ఎస్‌సీఐటీ ఇన్నోవేషన్ సెంటర్‌ను గవర్నర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు అంకితభావంతో ఉండాలన్నారు. భారతదేశం కరోనా తర్వాత ఇంత త్వరగా పూర్వస్థితికి చేరుకోవడానికి సాంకేతిక పరిజ్ఞానం, వైద్యుల సహకారం, కృషి ఎంతో ఉందని కొనియాడారు. ముఖ్యంగా తెలంగాణలో తయారైన వ్యాక్సిన్ వల్లనే ఇదంతా సాధ్యమైందని పేర్కొన్నారు. విద్యార్థులు చదువును ఆస్వాదించాలని, ఉత్సాహంగా ఉండాలని పిలుపునిచ్చారు. చదువుతోపాటు రీసెర్చ్, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలపైనా దృష్టి పెట్టాలన్నారు. శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో శ్రీ చైతన్య విద్యా సంస్థల డైరెక్టర్లు శ్రీవిద్య, సాయి గీతిక,సీఈఓ శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీ భవాని శంకర్, హెచ్‌ఓడీలు సిబ్బంది పాల్గొన్నారు.


వై-20 కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

గవర్నర్‌కు ఘన స్వాగతం


గవర్నర్‌కు పూలమొక్క అందిస్తున్న కలెక్టర్ గౌతమ్, పక్కన సీపీ వారియర్, అదనపు కలెక్టర్ స్నేహలత

ఖమ్మం సహకారనగర్ : జిల్లాకు వచ్చిన రాష్ట్ర గవర్నర్ తమిళి సై సౌందరరాజన్‌కు జిల్లా అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు. ఎన్నెస్పీ గెస్ట్‌హౌస్‌కు చేరుకున్న గవర్నర్‌ను కలెక్టర్ వీపీ గౌతమ్, సీపీ విష్ణు ఎస్ వారియర్, అదనపు కలెక్టర్లు స్నేహలత మొగిలి, ఎన్.మధుసూదన్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదర్శ్ సురభి తదితరులు పుష్పగుచ్ఛాలు అందించారు. కార్యక్రమంలో ఖమ్మం అర్బన్ తహశీల్దార్ శైలజ, డీఈఓ సోమశేఖర శర్మ, డీఐఈఓ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లలో జాప్యంపై రైతుల ఆగ్రహం

దమ్మాయిగూడెంలో అన్నదాతల రాస్తారోకో


దమ్మాయిగూడెంలో ఆందోళన చేస్తున్న రైతులు

తిరుమలాయపాలెం: ధాన్యం కొనుగోళ్లలో జాప్యంపై రైతులు ఆగ్రహించి రోడ్డెక్కిన ఘటన మండలంలోని దమ్మాయిగూడెంలో బుధవారం చోటుచేసుకుంది. ఇటీవల ఇదే గ్రామంలో 'బలగం' సినిమా పాట ద్వారా రైతుల కష్టాలను వివరిస్తూ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో బస్తాలు ఇవ్వడం లేదని, కాంటాలు వేయకపోవడంతో అక్కడే పడిగాపులు కాయాల్సి వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవలి అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తడిసి మొలకెత్తిందని, ఇప్పుడు మండుటెండల్లో నెల రోజులకు పైగా అక్కడే పడిగాపులు కాయాల్సి వస్తోందని అన్నారు. కాంటా వేసిన ధాన్యం కూడా లారీలు అందుబాటులో లేక గోడౌన్లకు తరలించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెబుతున్నా.. పీఏసీఎస్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఉన్నతాధికారులు వచ్చి స్పష్టమైన హామీ ఇస్తే తప్ప ఆందోళన విరమించేది లేదని ప్రకటించారు. కాగా రైతుల ధర్నాకు కాంగ్రెస్, సీపీఎం నాయకులు మద్దతు ప్రకటించారు. సుమారు గంట పాటు రాస్తారోకో చేయడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. అనంతరం మండల వ్యవసాయాధికారి సీతారాంరెడ్డి చేరుకుని తక్షణమే ధాన్యం కాంటాలు వేయిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీపీ మంగీలాల్ కూడా అధికారులతో మాట్లాడి ధాన్యం కాంటాలు వేయిస్తామని చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా పాలిసెట్


పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఖమ్మంసహకారనగర్: నగరంలోని ఆరు పరీక్ష కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన పాలిసెట్ -23 ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో మూడు సంవత్సరాల ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్, డిప్లొమా, వ్యవసాయ, వెటర్నరీ కోర్సుల ప్రవేశాల కోసం ఈ పరీక్ష నిర్వహించారు. మొత్తం 2,604 మంది విద్యార్థులకు గాను 2,355 మంది హాజరయ్యారని, 249 మంది గైర్హాజరయ్యారని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ జాకీరుల్లా తెలిపారు. ప్రతీ పరీక్ష కేంద్రాన్ని ప్రత్యేక పరిశీలకులు పర్యవేక్షించారని పేర్కొన్నారు.

స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి


ఫిట్‌నెస్‌ను పరిశీలిస్తున్న వరప్రసాద్

ఖమ్మంక్రైం: ఖమ్మం రవాణా శాఖ కార్యాలయ పరిధిలో ఉన్న స్కూల్ బస్‌లకు తప్పనిసరిగా ఫిట్‌నెస్ కలిగి ఉండాలని ఖమ్మం ఎంవీఐ వరప్రసాద్ అన్నారు. జూన్ మొదటి వారంలో పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రతీ బస్ ఫిట్‌నెస్ చేయించుకోవాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. బుధవారం ఖమ్మం రవాణా శాఖ కార్యాలయానికి ఫిట్‌నెస్ కోసం వచ్చిన ఏడు స్కూల్ బస్సుల్లో మూడు బస్‌లకు ఫిట్‌నెస్ లేదని చెప్పారు.

రాబడి పెంచేలా..

- ఖమ్మం కార్పొరేషన్‌లో ట్రేడ్ లైసెన్స్‌ల కోసం ప్రత్యేక బృందాలు
- ఇన్‌చార్జ్‌లుగా శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు బాధ్యతలు


ట్రేడ్ లైసెన్స్ జారీ ప్రక్రియను పరిశీలిస్తున్న కేఎంసీ ఆర్వో శ్రీనివాసరావు

ఖమ్మంమయూరిసెంటర్ : ఎన్ని ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ట్రేడ్ లైసెన్స్‌ల జారీలో సిబ్బంది, అధికారులు వెనుకబడుతూనే ఉన్నారు. గత మూడేళ్లుగా ట్రేడ్ లైసెన్సుల జారీకి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినా పూర్తి స్థాయిలో ఫలితం రావడం లేదు. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు నాలుగైదు నెలల ముందు ట్రేడ్ లైసెన్స్‌ల రెన్యూవల్, కొత్తవాటి జారీపై అధికారులు దృష్టి సారిస్తుండడంతో పెద్దగా ప్రయోజనం ఉండడం లేదని తెలుస్తోంది. అయితే ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచే దీనిపై దృష్టి పెట్టిన అధికారులు.. ఇటీవల లైసెన్స్‌ల రెన్యూవల్, కొత్తవి జారీ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో ఇప్పటికే ఇంటి పన్నుల వసూలు, ట్రేడ్‌లైసెన్స్‌ల జారీ ప్రక్రియ కొనసాగుతుండగా.. వీరికి అదనంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఇన్‌చార్జ్‌లుగా నియమించడంతో పాటు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తూ కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి నిర్ణయించారు.

ఆదాయం పెంచుకోవడమే లక్ష్యంగా..

కేఎంసీ పరిధిలో ఆస్తి పన్నులు వసూలు చేసిన విధంగా ట్రేడ్ లైసెన్స్‌ల ద్వారా అధికారులు ఆదాయాన్ని రాబట్టలేకపోతున్నారన్న విమర్శలు ఉన్నాయి. మున్సిపల్ యాక్ట్ ప్రకారం ట్రేడ్ లైసెన్స్‌లను పూర్తి స్థాయిలో జారీ చేస్తే రూ.2 కోట్లకు పైగా ఆదాయం సమకూరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. నగరంలో సుమారు 8 వేల వరకు వివిధ వ్యాపార సంస్థలు ఉన్నాయి. ప్రతి వ్యాపారి ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలి. అయితే గతేడాది లెక్కల ప్రకారం కేఎంసీలో 3,728 లైసెన్స్‌లు మాత్రమే ఉన్నాయని సమాచారం. వీటి ద్వారా కేఎంసీకి గత ఆర్థిక సంవత్సరంలో రూ.98 లక్షల వరకు ఆదాయం వచ్చింది.

నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా..

శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో ఏర్పాటు చేసిన బృందాలు రోజుకు ఒక్కో బృందం 10 వరకు లైసెన్స్‌లు జారీ చేసేలా లక్ష్యాలను నిర్దేశించారు. బృంద సభ్యులు తిరగాల్సిన ప్రాంతాలను కేటాయించారు. ఈ బృందానికి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇన్‌చార్జ్‌గా ఉంటారు. నలుగురు బిల్లు కలెక్టర్లు, ఒక కంప్యూటర్ ఆపరేటర్ సభ్యులుగా ఉంటారు. వీరు ట్రేడ్ లైసెన్స్ లేని వ్యాపార సముదాయానికి యజమానితో సెల్ఫ్ అసెస్‌మెంట్ చేసుకునేలా అవగాహన కల్పించనున్నారు. ఇంతకు ముందే లైసెన్సు కలిగి ఉన్న వారికి రెన్యూవల్ చేసి, ఫీజు కట్టించుకోనున్నారు. వ్యాపార సముదాయం భవన కొలతలను వారి అసెస్‌మెంట్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఆ లెక్కల ప్రకారం ట్రేడ్ లైసెన్సు ఫీజును నిర్దేశించనున్నారు.

ప్రతీ వ్యాపారికి లైసెన్స్ ఉండాలి

ఖమ్మం నగరంలో వ్యాపారం చేసే ప్రతి ఒక్కరూ ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలి. లైసెన్సు లేని వారిపై మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటాం. లైసెన్స్ లేకున్నా.. ఉన్న వారు రెన్యూవల్ చేసుకోకపోయినా వారికి ఫీజులో 25 శాతం అపరాధ రుసుం విధిస్తాం. నగరంలో ప్రత్యేక బృందాలు ట్రేడ్ లైసెన్సుల జారీ ప్రక్రియను వేగవంతంగా నిర్వర్తిస్తున్నాయి. – జి.శ్రీనివాసరావు, కేఎంసీ ఆర్ఓ


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

స్వామివారికి స్నపన తిరుమంజనం

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు జరిపించారు. బుధవారాన్ని పురస్కరించుకుని స్వామివారికి స్నపన తిరుమంజనం నిర్వహించారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి

అదనపు కలెక్టర్ స్నేహలత


విజేతలకు బహుమతులు అందజేస్తున్న స్నేహలత

చింతకాని : గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించాలని అదనపు కలెక్టర్ స్నేహలత మొగిలి అన్నారు. మండల పరిధిలోని కొదుమూరులో నిర్వహించిన సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బుధవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం క్రీడా రంగానికి పెద్దపీట వేస్తోందని, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఇలాంటి పోటీలు నిర్వహిస్తోందని తెలిపారు. క్రీడాకారుల్లోని ప్రతిభను గుర్తించేందుకు గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశామని చెప్పారు. యువత అన్ని రంగాల్లో ముందుండాలని ఆకాంక్షించారు. మండల స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొని రాణించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ మంగీలాల్, గ్రామసర్పంచ్ నక్కన బోయిన సుజాత, ఎంఈఓ మోదుగు శ్యాంసన్, ఎంపీఓ మల్లెల రవీంద్రప్రసాద్, పాఠశాల హెచ్ఎం పోటు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన


పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

చింతకాని: మండలంలోని అనంతసాగర్ గ్రామాన్ని గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనరేట్ ప్రత్యేకాధికారి జి.రాజు బుధవారం సందర్శించారు. గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు.

'ఎక్సైజ్'లో బదిలీల కాక !

చర్చనీయాంశంగా మారిన ఇద్దరు సీఐల స్థానచలనం

ఖమ్మంక్రైం : జిల్లా ఎక్సైజ్ శాఖలో ఇద్దరు సీఐలు బదిలీ అయిన విషయం కాక పుట్టిస్తోంది. పలువురు అధికారులు ఎన్నో ఏళ్లుగా బదిలీ కోసం ఎదురుచూస్తుండగా ఇద్దరు సీఐలకు మాత్రమే స్థాన చలనం కలగడం చర్చనీయాంశంగా మారింది. ఖమ్మం ఎక్సైజ్ టూటౌన్ సీఐగా పనిచేస్తున్న జయశ్రీని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు, అక్కడ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ విభాగంలో పనిచేస్తున్న రాజిరెడ్డిని ఖమ్మం టూటౌన్‌కు బదిలీ చేశారు.

చీఫ్ సెక్రటరీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు..

ఎక్సైజ్ శాఖలో గతంలో కమిషనర్ మాత్రమే సీఐ స్థాయి అధికారులను బదిలీ చేసేవారు. కానీ ఇప్పుడు దీనికి భిన్నంగా రాష్ట్ర చీఫ్ సెక్రటరీ కార్యాలయం నుంచి సీఐలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ కావడం గమనార్హం. దీంతో ఇది రాజకీయ బదిలీ అని ఎక్సైజ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఎక్సైజ్ స్టేషన్-2 పరిధి పాలేరు నియోజకవర్గంలో ఉండటంతో అక్కడి బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధి ఒత్తిడి వల్లే ఈ బదిలీ జరిగిందని, ఏకంగా చీఫ్ సెక్రటరీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యేలా ఆ ప్రతినిధి చక్రం తిప్పారని ఎక్సైజ్ సిబ్బంది అంటున్నారు. అయితే ఖమ్మం ఎక్సైజ్ టూటౌన్ నుంచి బదిలీ అయిన సీఐ కూడా జిల్లాలో కీలకమైన బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధి కూతురు కావడం గమనార్హం. దీంతో బదిలీ వ్యవహారంపై ఆ శాఖలో మరింతగా చర్చ జరుగుతోంది. ఇదిలా ఉండగా ఉమ్మడి జిల్లాలో 17 మంది ఎక్సైజ్ సీఐలు ఏళ్ల తరబడి బదిలీలు జరగక, పోస్టింగ్‌ల కోసం ఎదురు చూస్తున్నారు. అదేవిధంగా సీఐలుగా పదోన్నతి పొంది రెండేళ్లు దాటినా పోస్టింగ్ లేక ఎస్సైలుగా పని చేస్తున్న వారిలో ఒకరికి ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్-2 సీఐగా పోస్టింగ్ ఇవ్వడంతో తమకు మోక్షం ఎప్పుడోనని మిగిలిన వారు ఎదురు చూస్తున్నారు. కాగా, రాజిరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

క్లుప్తంగా

హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ స్టడీ సర్కిల్‌లో 5 నెలల ఫౌండేషన్ కోర్సులో ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ పొందేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 21న ప్రవేశ పరీక్ష ఉంటుందని, అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను టీఎస్ స్టడీ సర్కిల్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని ఎస్సీడీడీ కస్తాల సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21వ తేదీ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఖమ్మంలోని ఎస్ఆర్అండ్ బీజీఎన్ఆర్ కళాశాలలో ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఉదయం 10.15 గంటల వరకు హాల్‌టికెట్, ఐడీ కార్డ్, బ్లాక్ బాల్ పాయింట్ పెన్ తీసుకొని పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, ఇతర ఏ వస్తువులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించరని వెల్లడించారు. పూర్తి సమాచారం కోసం 98484 94290, 90320 77276 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మండల పరిషత్ కార్యాలయంలో తనిఖీ



ఎంపీడీఓ కార్యాలయంలో జెడ్పీ సీఈఓ

చింతకాని: మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పీ సీఈఓ వి.అప్పారావు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చేపట్టిన పనులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పలు శాఖల అధికారులతో మాట్లాడి పనులకు సంబంధించిన పురోగతిపై సమీక్షించారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన పలు రికార్డులు, రిజిష్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ



మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

ఖమ్మంగాంధీచౌక్: ఎండ తీవ్రంగా ఉండటంతో ఉపశమనం పొందేందుకు ఖమ్మం పాత బస్టాండ్‌లో శివరాజు కృష్ణప్రసాద్ జ్ఞాపకార్థం, టీమీడియా, అఖిల భారత బ్రాహ్మణ సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వేదాంతం శ్రీమన్నారాయణచార్యులు, శ్రీదేవి దంపతులు, సుడా డైరెక్టర్ మాటూరు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. వేసవికాలంలో స్వచ్ఛంద సంస్థలు సామాజిక కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టీమిడియా చైర్మన్ శనగపాటి మురళీకృష్ణ, జి.నరేశ్, ఏవో శివరాజు, శ్రీరమ, వేదాంతం పవన్‌కుమార్, లహరి, శ్రీయాన్, రఘురాం, లంకా ప్రసాద్, ఏడునూతల ప్రభాకర్ పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ స్టాళ్లు ప్రారంభం



రిజిస్ట్రేషన్ స్టాల్ వద్ద పోలీసులు

ఖమ్మంక్రైం: ఖమ్మం పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం మెగాజాబ్ మేళాను దిగ్విజయం చేయనున్నట్లు ఖమ్మం టూటౌన్ సీఐ శ్రీధర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సర్దార్ పటేల్ స్టేడియం రెండు ప్రవేశ ద్వారాల వద్ద రిజిస్ట్రేషన్ స్టాల్స్‌ను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. నిరుద్యోగ యువతీ, యువకులు స్టాల్స్ వద్దకు వచ్చి రిజిస్ట్రేషన్ ఫామ్‌లను ఉచితంగా పూర్తి చేసి వివరాలు అందజేయాలని ఆయన కోరారు.

రెండు కార్లు ఢీ



రఘునాథపాలెం: రెండు కార్లు ఎదురెదురుగా వచ్చి ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైన ఘటన మండల కేంద్రంలోని ఖమ్మం – ఇల్లెందు ప్రధాన రోడ్డులో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఖమ్మం నుంచి ఇల్లెందు వైపు వెళ్తున్న కారును ఎదురుగా వచ్చిన అగ్ని మాపక దళం శాఖకు చెందిన కారు ఢీకొట్టింది. దీంతో ఖమ్మం నుంచి వెళ్తున్న కారులో ఉన్న సీతారాంతో పాటు ఓ బాలికకు గాయాలైనట్లు తెలిసింది. అప్పటికే సదరు బాలిక పలు వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి వెళ్లి వస్తుండగా కారు ఢీకొట్టడంతో మళ్లీ వారిని ఆస్పత్రికి తరలించారు. రఘునాథపాలెం ఎస్ఐ రవిని వివరణ కోరగా తమకు ఇంకా ఫిర్యాదు అందలేదని, ప్రమాదానికి గురైన వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

కొలువుల పేరుతో దగా

- జెన్‌కోలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ టోకరా
- పలువురి వద్ద రూ.లక్షలు వసూలు
- ఐదేళ్లుగా ఉద్యోగం కల్పించక.. డబ్బులు ఇవ్వక తిప్పకుంటున్న నేతలు



కేటీపీఎస్ కాంప్లెక్స్

పాల్వంచ: నిరుద్యోగ యువతను మోసం చేయడమే పనిగా పెట్టుకుంటున్నారు కొందరు కార్మిక సంఘాల నేతలు. జెన్‌కోలో ఉద్యోగాలు కల్పిస్తామంటూ మాయమాటలతో లక్షలాది రూపాయలు దండుకున్నారు. 2018 నుంచి ఉద్యోగం ఇప్పించక పోయినా డబ్బులు తిరిగి ఇవ్వమని బాధితులు నాయకుల చుట్టూ తిరుగుతున్నా కనీసం పట్టించుకోక పోవడంతో లబోదిబోమంటున్నారు. ఇంట్లో నుంచి కొంత, బయటి నుంచి కొంత అప్పు చేసి తీసుకెళ్లి వేరే వ్యక్తుల చేతుల్లో పెట్టడంతో కుటుంబ సభ్యుల నుంచి ఒత్తిడి వస్తుండటంతో బాధితులు ఏంచేయాలో పాలుపోక ఇబ్బందులు పడుతున్నారు. కనీసం ప్రైవేట్ జాబ్‌లు చేసుకునేందుకు వెళ్దామన్నా.. వారి చదువుకు తగ్గట్టుగా విదేశాల నుంచి కూడా ఉద్యోగ అవకాశాలు వస్తున్నా చేతిలో చిల్లిగవ్వ లేక నానా అవస్థ పడుతున్నారు. ఓ కార్మిక సంఘం నేత ఇలా పలువురి వద్ద లక్షలాది రూపాయలు పోగు చేసుకున్నాడు. ఈ అక్రమ వసూళ్ల వ్యవహారంపై బాధితులు పోలీస్ స్టేషన్ వేదికగా సెటిల్‌మెంట్‌కు తెరలేపడం చర్చనీయాంశమైంది. మరో కార్మిక సంఘానికి అనుకూలంగా ఉండే వ్యక్తి సైతం భూ నిర్వాసితుల పేరుతో భారీ ఎత్తున డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అతడికే ఉద్యోగం లేక పోగా ఇతరుల నుంచి డబ్బులు వసూలు చేసిన విషయంపై పలుమార్లు బాధితులు పోలీసులను ఆశ్రయించిన ఘటనలు కూడా ఉన్నట్లు సమాచారం.

ఉద్యోగం పేరుతో వల

పాల్వంచకు చెందిన బీటీపీఎస్ ఉద్యోగి (జేపీఏ), ఓ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. 2018 నుంచి మధ్యవర్తుల పేరుతో నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి వల విసురుతున్నాడు. ఓ ఫార్మసీ కళాశాలలో పనిచేసే లెక్చరర్ (ఆంధ్రావాసి) నుంచి జెన్‌కో జేఏవో (జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్) ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి సుమారు రూ.25 లక్షల వరకు వసూలు చేశాడు. ఇక అతడినే పావుగా వాడుకుని అతడి ద్వారా సదరు కళాశాలలో పనిచేసే పలువురు లెక్చరర్లు, స్టూడెంట్ల నుంచి ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేశాడు. డిసీజ్ కోటా (కారుణ్య నియామకాలు) ఉద్యోగాలు చాలా వరకు ఖాళీగా ఉన్నాయని, అందులో కొందరు వారసులు వేరే సెక్టార్లలో సెటిల్ అయ్యారని, అక్కడ మిగిలిన ఉద్యోగాలను దొడ్డిదారిన ఇప్పిస్తానని, ఆర్టిజన్ల మూడో లిస్ట్ కూడా తీస్తారని ఇలా ఏదో ఒక దాంట్లో ఉద్యోగాలు కల్పిస్తామని ఆశ చూపించినట్లు తెలుస్తోంది. సదరు లెక్చరర్ తాను ఉద్యోగం కోసం డబ్బులు కట్టానని.. మీరు కూడా కట్టండని కొందరిని నమ్మించాడు. దీంతో మంచిర్యాలకు చెందిన అమాయక మధ్యతరగతి కుటుంబానికి చెందిన యువకుడు రూ.5 లక్షల వరకు అప్పు చేసి తెచ్చి ఇచ్చాడు. సూర్యాపేటకు చెందిన ఓ వ్యక్తి నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేశారు. ఇలా భూపాలపల్లి, మంచిర్యాల, ఖమ్మం, సత్తుపల్లి, పాల్వంచ, సూర్యాపేట ప్రాంతాలకు చెందిన బాధితులు సుమారు 20 మంది వరకు ఉండే అవకాశం ఉన్నట్లు సమాచారం. 2018లో వసూలు చేసిన ఈ డబ్బులను ఇప్పటి వరకు చెల్లించక పోవడంతో బాధితుల నుంచి ఒత్తిడి పెరిగింది. డబ్బులు కట్టే క్రమంలో ప్రాంసరీ నోట్‌లు, చెక్కులు ఇచ్చినప్పటికీ వాటిని కోర్టులో వేస్తే సెటిల్ అయ్యే సరికి ఏళ్లు గడుస్తాయని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై ఇటీవల పోలీసుల దృష్టికి సైతం తీసుకెళ్లారు. ఉద్యోగం వస్తే ఇక్కడే సెటిల్ కావొచ్చని చెప్పి ఆశ పడ్డామని, భారీ మొత్తంలో డబ్బులు ఇవ్వడంతో ఇంట్లో నుంచి కూడా ఒత్తిడి ఉందని, తమ చదువులకు విదేశాల నుంచి కూడా పలుమార్లు అవకాశాలు వచ్చినా డబ్బులు లేక తిరుగుతున్నామని బాధితులు వాపోయారు. కాగా, పది రోజుల్లోగా రూ.25 లక్షలు వెనక్కి ఇచ్చేలా సదరు కార్మిక సంఘం నాయకుడు నోట్ రాసి ఇవ్వడం గమనార్హం. ఈ విషయంపై జెన్‌కో సీఎండీ, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తినట్లు విశ్వసనీయ సమాచారం.

మరికొందరు ఇదే బాటలో..

అమాయక నిరుద్యోగులకు ఉద్యోగం పేరుతో కొందరు కార్మిక సంఘాల నేతలు లక్షలాది రూపాయలు దండుకుని బాధితులను కొన్నేళ్లపాటు తిప్పుకుంటున్న ఎగ్గొట్టడం, లేదా సెటిల్ చేసుకుని కొంత తిరిగి వెనక్కి ఇచ్చి కొంత ఇవ్వకుండా అక్కడక్కడ ఖర్చు చేయాల్సి వచ్చిందని చెబుతున్నట్లు తెలుస్తోంది. ఇలా పోగు చేసుకున్న డబ్బుతో భూములు, ఇళ్లు కొనుగోలు చేశారనే విమర్శలు ఉన్నాయి. అంతేగాక ఉద్యోగం ఎంత వరకు వచ్చిందని తిరిగే బాధితులతో మందు తెప్పించుకోవడం, వారి సొంత పనులు సైతం చేయించుకుని ఏళ్ల తరబడి తిప్పించుకున్నట్లు తెలుస్తోంది. అందరితో పాటు ఉద్యోగం చేసే నాయకులు కొందరు ఊహించని విధంగా ఎదగడంపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉద్యోగం ఉండి కూడా నిరుద్యోగులను మోసం చేస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఇటీవల మా దృష్టికి తెచ్చారు.



ఇటీవల ఉద్యోగం పేరుతో కార్మిక సంఘం నాయకుడు డబ్బులు తీసుకున్నాడని బాధితులు మా దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయంపై ఆరా తీస్తున్నాం. అయితే డబ్బులు వెనక్కి ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నట్లు కూడా తెలిసింది. లిఖిత పూర్వకంగా బాధితులు ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే తప్పక చర్యలు తీసుకుని న్యాయం చేస్తాం. ఉద్యోగాల పేరుతో మోసం చేసే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలి. – కె.నరేశ్, పట్టణ ఎస్ఐ

బ్లాక్ స్పాట్ల గుర్తింపు..

వైరా రోడ్డును పరిశీలించిన పోలీసులు, ఇంజనీర్లు



బ్లాక్ స్పాట్లను పరిశీలిస్తున్న పోలీసులు, ఇంజనీర్లు

ఖమ్మంక్రైం/కొణిజర్ల: వాహన ప్రమాదాలను అరికట్టేందుకు పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని సీపీ విష్ణు ఎస్.వారియర్ ఆదేశించిన నేపథ్యంలో బుధవారం పోలీసులు, ఇంజనీర్ల బృందం ఖమ్మం నుంచి వైరా వెళ్లే ప్రధాన రహదారిపై పలు బ్లాక్ స్పాట్లను గుర్తించారు. ఇటీవల అత్యధికంగా రోడ్డు ప్రమాదాల కారణంగానే పలువురు ప్రాణాలు కోల్పోతుండటంతో దీనికి గల కారణాలను విశ్లేషించేందుకు వారు ఈ బ్లాక్ స్పాట్లను సందర్శించారు. కాగా, ఈ ఏడాది 250 రోడ్డు ప్రమాదాలు జరుగగా 78 మంది మృతి చెందారని, 247 మంది గాయపడ్డారని జిల్లా రహదారుల భద్రతా సమన్వయ కమిటీ వెల్లడించింది. ద్విచక్రవాహనదారులు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారని, అధిక లోడుతో వెళ్లే లారీలు, సామర్థ్యం మించి ఆటోల్లో ప్రయాణికులను ఎక్కించుకోవడం వల్ల అనుకోని ఘటనలు సంభవించాయని ఆ కమిటీ పేర్కొంది. ఈ నేపథ్యంలో వారు బ్లాక్ స్పాట్లు గుర్తించి మాట్లాడుతూ.. పోలీస్, రవాణా, ఇంజనీరింగ్, ఆరోగ్యశాఖల అధికారుల సమన్వయంతో ఇంటిగ్రేటెడ్ రోడ్ యాక్సిడెంట్ డేటా బేస్ (ఐరాడ్) ద్వారా కారణాలు తెలుసుకుని నివారణకు ముందస్తు చర్యలు చేపట్టినా రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయని, దీంతో అన్ని శాఖల అధికారులు రోడ్డు భద్రతపై దృష్టి పెట్టినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 68 బ్లాక్ స్పాట్‌లు గుర్తించినట్లు చెప్పారు. రేడియం స్టిక్కర్లు లేని పెద్ద వాహనాలు, టిప్పర్లు, ట్రాక్టర్లే ఎక్కువగా ప్రమాదాలకు కారణమవుతున్నాయన్నారు. హెల్మెట్ ధరించి ద్విచక్రవాహనం నడపటం వల్ల ప్రమాదాల తీవ్రత తగ్గుందని తెలిపారు. బ్లాక్ స్పాట్లలో బారికేడ్‌లు, ప్రమాద సంకేత సూచిక బోర్డులు, స్టాపర్లు, సిగ్నల్ లైట్లు, బ్లింకింగ్ లైట్లు ఏర్పాటు చేసి ప్రమాద నివారణకు చర్యలు చేపడుతున్నట్లు వారు వివరించారు. ఈ బృందంలో ట్రాఫిక్ ఏసీపీ రామోజీ రమేశ్, వైరా ఏసీపీ రెహమాన్, ఎన్‌హెచ్ఏఐ మేనేజర్ పద్మావతి, డీఈ సూరిబాబు, ట్రాఫిక్ సీఐ అంజలి, వైరా సీఐ సురేశ్, ఎస్ఐ శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మీ హరిత స్ఫూర్తి బాగుంది

ఖమ్మం పెద్దాస్పత్రి ఏఓకు ఎంపీ సంతోష్ కితాబు



జెర్సీని ఆవిష్కరిస్తున్న ఎంపీ సంతోష్‌కుమార్

ఖమ్మం వైద్యవిభాగం: 'మీ హరిత స్ఫూర్తి బాగుంది.. మారుమూల గ్రామాల్లో మొక్కలు నాటడం నచ్చింది. దేవాలయాల్లో మీరు నాటిన జమ్మి మొక్కలు ఎంతో ఆనందాన్ని కలిగించాయి. ఇదే ఒరవడి ఇక ముందు కూడా కొనసాగించాలి' అని గ్రీన్ ఇండియా చాలెంజ్ ఫౌండర్, రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్ ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి ఏఓ డాక్టర్ కేసగాని రాజశేఖర్ గౌడ్‌ను అభినందించారు. బుధవారం ప్రగతిభవన్‌లో రాజశేఖర్ గౌడ్ సంతోష్‌కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గ్రీన్ ఇండియా చాలెంజ్ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. భవిష్యత్తు లక్ష్యాలను కూడా ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గ్రీన్ ఇండియా చాలెంజ్ ద్వారా చేపడుతున్న కార్యక్రమాల్లో పద్మశ్రీ పురస్కార గ్రహీత వనజీవి రామయ్యను భాగస్వామ్యం చేయడం పట్ల సంతోష్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. గ్రీన్ ఇండియా చాలెంజ్ ఐదో ఏడాదిలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో రాజశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో రూపొందించిన జెర్సీని సంతోష్‌కుమార్ ఆవిష్కరించారు.

యువశక్తిని మేల్కొల్పడమే లక్ష్యం



పువ్వాళ్ల దుర్గాప్రసాద్

ఖమ్మంసహకారనగర్: హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ స్ఫూర్తిగా తెలంగాణ యువశక్తిని మేల్కొల్పడమే లక్ష్యమని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 8న హైదరాబాద్ సరూర్‌నగర్ నిరుద్యోగ నిరసన సభలో ప్రియాంక గాంధీ ప్రకటించిన హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ స్ఫూర్తిగా తెలంగాణ యువశక్తిని మేల్కొలిపే దిశగా కాంగ్రెస్ ముందుకు వెళ్తుందన్నారు. అందులో భాగంగా జూన్ 2న రాష్ట్రవ్యాప్తంగా రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలు నిర్వహిస్తామని, ఆసక్తి కలిగిన యువత 76618 99899 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి తమ పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ ఆన్‌లైన్ పరీక్షకు జూన్ 1 వరకు అభ్యర్థులు తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. నియోజకవర్గవ్యాప్తంగా విజేతలకు మొదటి మూడు బహుమతులు ల్యాప్‌టాప్, స్మార్ట్‌ఫోన్, ట్యాబ్‌లెట్‌లతో పాటు 40 ప్రోత్సాహక బహుమతులు, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోని ఒక మహిళా టాపర్‌కు ఎలక్ట్రిక్ స్కూటర్ అందజేయనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో పార్టీ నాయకులు నాగండ్ల దీపక్‌చౌదరి, ముజాహిద్‌హుస్సేన్, బొడ్డు బొందయ్య, మొక్కా శేఖర్‌గౌడ్, యర్రం బాలగంగాధర్‌తిలక్, కార్పొరేటర్లు దుద్దుకూరి వెంకటేశ్వర్లు, మలీదు వెంకటేశ్వర్లు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ రవికుమార్, మద్ది వీరారెడ్డి, నాగరాజు, కైజర్ పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడిగా మళ్లీ 'పువ్వాళ్ల'

జిల్లా కాంగ్రెస్ కమిటీ(డీసీసీ) అధ్యక్షుడిగా పువ్వాళ్ల దుర్గాప్రసాద్ రెండోసారి నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

డిగ్రీ సెమిస్టర్ల పరీక్షలు వాయిదా

- ఎండల నేపథ్యంలో పలువురి విజ్ఞప్తి మేరకు నిర్ణయం
- జూన్ 13 నుంచి పరీక్షలు

కేయూక్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో జరగనున్న పలు సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేశారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, అదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ కోర్సుల బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీఒకేషనల్, బీసీఏ, బీఏ (ఎల్) పీడీసీ కోర్సుల 4, 6వ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ మధుకర్, డాక్టర్ నరేందర్ బుధవారం వెల్లడించారు. తిరిగి జూన్ 13 నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కేయూ పరిధిలో డిగ్రీ 4వ, ఆరో సెమిస్టర్ల పరీక్షలు కీలకమైనవి. మే నెలలోనే నిర్వహించాలనే విధంగా రెండు మూడుసార్లు టైం టేబుల్ షెడ్యూళ్లను విడుదల చేసినా పరీక్షల విభాగం అధికారులు వివిధ కారణాలతో ముఖ్యంగా వివిధ సెట్ల పరీక్షలు ఉండటంతో వాయిదా వేస్తూ వచ్చారు. చివరికి ఈ నెల 22 నుంచి పరీక్షలు నిర్వహిస్తామని టైం టేబుల్ విడుదల చేశారు. అయితే ఈ షెడ్యూల్‌ను ప్రకటించాక ఈవేసవిలో ఎండలు మండిపోతున్నాయని తమకు ఇబ్బంది అని పరీక్షల విధులను నిర్వహించాల్సిన వివిధ డిగ్రీ కళాశాలల అధ్యాపకులు పరీక్షల విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. హనమకొండ, వరంగల్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలకు చెందిన పలువురు మహిళా అధ్యాపకులు బుధవారం వీసీ ఆచార్య తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ఆచార్య శ్రీనివాస్, పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డిని కలిసి డిగ్రీ పరీక్షలు వాయిదా వేయాలని విన్నవించారు. వారికి మద్దతుగా ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ ఉన్నారు.

ఆలస్యమైతే ఫలితాలపై ప్రభావం

డిగ్రీ కోర్సుల విద్యార్థులకు 6వ సెమిస్టర్ పరీక్షలు కీలకమైనవి. ఈ పరీక్షలు మే, జూన్‌లో పూర్తయితేనే ఫలితాలు సకాలంలో వచ్చే అవకాశం ఉంటుంది. ఇప్పుడు జూన్ – జూలైలో జరగబోతున్నందున ఫలితాలపై ప్రభావం చూపనుందని భావిస్తున్నారు. ఎందుకంటే డిగ్రీ కోర్సుల 6వ సెమిస్టర్ పరీక్షలతో కోర్సు పూర్తయితే ఉన్నత విద్య ఇతర కోర్సుల్లోకి ప్రవేశాలకు అవకాశం కలుగుతుంది. పీజీతోపాటు వివిధ ప్రొఫెషనల్ కోర్సులకు సంబంధించి ప్రవేశపరీక్షలు అన్నీ మే నెలలోనే జరగబోతున్నాయి. వాటి ఫలితాలు వచ్చేలోగా డిగ్రీ ఆరో సెమిస్టర్ పరీక్షలు పూరిచేసి ఫలితాలను సకాలంలో ఇస్తేనే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

పోలీస్‌స్టేషన్‌లో యువకుల వీరంగం



మద్యం మత్తులో ఉన్న యువకులను వారిస్తున్న ఎస్ఐ స్రవంతి

నేలకొండపల్లి: మద్యం మత్తులో ముగ్గురు యువకులు పోలీస్‌స్టేషన్‌లో వీరంగం సృష్టించారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని మంగ్రాజుపల్లి గ్రామంలో జరిగిన వివాహానికి సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన కార్తీక్, ఆర్.వినయ్, కె.గోపి హాజరయ్యారు. బుధవారం రాత్రి ఓ వైన్స్‌లో మద్యం సేవించేందుకు వెళ్లారు. అక్కడ వీరికి నేలకొండపల్లికి చెందిన ఎన్.గోపికి సెల్‌ఫోన్ మాట్లాడే విషయంలో తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. ఒకరిపై మరొకరు దాడి చేసుకోవడంతో ఇరువర్గాలకు గాయాలయ్యాయి. దీంతో నేలకొండపల్లికి చెందిన ఎన్.గోపి మద్యం దుకాణంలో తనపై ముగ్గురు వ్యక్తులు దాడి చేసి సెల్‌ఫోన్ గుంజుకున్నారని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కోదాడ యువకులను పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. అక్కడ కూడా యువకుల మధ్య వాగ్వాదం జరిగింది. ముగ్గురు యువకులు పోలీస్‌స్టేషన్‌లో హల్‌చల్ చేశారు. పోలీసుల పట్ల అనుచితంగా వ్యవహరించారు. ఎస్ఐ స్రవంతి ఎంత వారించినా వినకుండా అరుపులు, కేకలతో వీరంగం సృష్టించారు. పోలీసుల విధులను అడ్డగించడంతో పాటు అనుచితంగా ప్రవర్తించినందుకు కోదాడకు చెందిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ స్రవంతి తెలిపారు. కూసుమంచి సీఐ జితేందర్ నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని విచారించారు.

మొక్కజొన్న చేనులో అగ్నిప్రమాదం



మంటలు అదుపులోకి తెస్తున్న అగ్నిమాపకదళం

రఘునాథపాలెం: మండలంలోని రేగులచలక గ్రామంలో బుధవారం మొక్కజొన్న పొలంలో మంటలు చెలరేగాయి. గుర్తించిన సర్పంచ్ అగ్నిమాపక శాఖకు సమాచారం అందించాడు. వారు వచ్చి మంటలను అదుపు చేసినట్లు గ్రామ కార్యదర్శి సంగీత తెలిపారు. హరితహారం చెట్లకు ఎలాంటి నష్టం జరగలేదన్నారు. కాగా, మంటలు అదుపులోకి రావడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన బైక్

ఒకరు మృతి

కల్లూరు: విద్యుత్ స్తంభాన్ని బైక్ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన ఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. పాల్వంచలోని ఓ హోటల్‌లో పనిచేస్తున్న స్నేహితులు నంది గామ కనకాచారి (28), షేక్ గఫార్ కలిసి బైక్‌పై కల్లూరు మండలం ఎర్రబోయినపల్లి బయలుదేరారు. గఫార్ కుమార్తె ఎర్రబోయినపల్లిలో నివాసముంటోంది. ద్విచక్ర వాహనాన్ని కనకాచారి నడుపుతున్నాడు. వెనుక గఫార్ కూర్చున్నాడు. కల్లూరు మండలంలో జీడీబీపల్లి రైస్‌మిల్లు టర్నింగ్ వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి నేరుగా విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో కనకాచారి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. గఫార్‌కు గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుబల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య శైలజ, ఇద్దరు ఆడపిల్లలున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బోనకల్: మండలంలోని కలకోట గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. మధిర మండలం దెందుకూరు గ్రామానికి చెందిన పల్లెపోగు శ్రీకాంత్ ద్విచక్ర వాహనంపై చిన్నారిని ఎక్కించుకొని వైరావైపు వెళ్తున్నాడు. కలకోట సమీపంలో గేదె ఎదురు రావడంతో గమనించని శ్రీకాంత్ గేదెను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శ్రీకాంత్‌తో పాటు చిన్నారికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆటోలో మధిర ఆస్పత్రికి తరలించారు.

ఖమ్మం నగరంలో..

ఖమ్మంఅర్బన్: నగరంలోని ఇల్లెందు రోడ్డులో ఎన్నెస్పీ విశ్రాంతిభవనం ఎదుట బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం .. ద్విచక్రవాహనాన్ని బొలెరో ఢీకొట్టడంతో గాయపడిన యువకుడిని గవర్నర్ పర్యటన కోసం బందోబస్తు విధులు నిర్వర్తిస్తున్న వన్‌టౌన్ సీఐ స్వామి ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అటవీ భూమి హక్కుపై అభ్యంతరాలుంటే తెలపండి

కారేపల్లి ఎఫ్ఆర్వో సిద్దార్థరెడ్డి

కామేపల్లి(కారేపల్లి): కారేపల్లి ఫారెస్టు రేంజ్ పరిధిలోని చీమలపాడు రిజర్వు ఫారెస్టు తాళ్లగూడెం సెక్షన్, మద్దులపల్లి బీట్, కంపార్ట్‌మెంట్ 5లో గల అటవీ భూమిలో మొక్కలు పెంచాలని అటవీ శాఖ నిర్ణయించిందని ఎఫ్ఆర్ఓ సిద్దార్థరెడ్డి తెలిపారు. ఆ భూములపై ఎవరికైనా హక్కులు, అభ్యంతరాలు ఉంటే సంబంధిత ఆధారాలతో తెలియజేయాలని బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. ఈ నెల 20వ తేదీలోపు కారేపల్లి ఫారెస్టు రేంజ్ కార్యాలయంలో హాజరై వివరణ ఇవ్వాలని కోరారు. గడువు తేదీ లోపు సంబంధిత ఆధారాలు ఇవ్వకుంటే ఎవరికీ హక్కులు లేవని నిర్ధారణ చేస్తామని పేర్కొన్నారు.

